

A Very Well-Acclaimed Aauthor Of
Two English Novels
**"The Enemy of the Mankind" and**
**"The Dictator of the Dark"**

# సూర్యదేవర రామ్ మోహన రావు

**AUTHOR OF HIGHEST NUMBER OF NOVELS IN TELUGU**
**AUTHOR OF HIGHEST NUMBER OF NOVELS TRANSLETED INTO KANNADA**



# అమృత

# అమృత

సూర్యదేవర రామమోహనరావు

# అమృత

## -సూర్యదేవర రామ్‌మోహనరావు

**మానస సరోవరం గురించి వినటమే గాని చూసినవాళ్ళు అరుదు. నిజానికి ఆ సరస్సు మన ఊహలకి కూడా అందదు. 16 వేల అడుగుల ఎత్తున 150 మైళ్ళ వైశాల్యం గల సరోవరం వుందని మనం ఊహించగలమా? కానీ ఇది హిమాలయ శిఖరాలలో సాధ్యమైంది.**

పురాణ ప్రసిద్ధి ప్రకారం ఈ మానస సరోవరాన్ని బ్రహ్మదేవుడు తన మనస్సంకల్పంతో సృష్టించాడు. అందుకనే దీనికి మానస సరోవరమని పేరు వచ్చింది.

కైలాస పర్వతే రామా మనసా నిర్మితం పరం ।

బ్రహ్మణా నరశార్దుల తేనేదం మానసం సరః ॥

తస్మాత్ సుస్రావ సరసః సాయోధ్యా ముపగూహత్ ।

సరః ప్రసూతా సరయూః పుణ్యా బ్రహ్మ సరశ్చ్యుతా ॥

ఓ రామా! కైలాస పర్వతంలో బ్రహ్మ మనస్సు వల్ల సృష్టి పొందిన సరస్సు వుంది. దాని పుట్టుక కారణంగానే దానికి మానస సరోవరమనే పేరు వచ్చింది. దానిలో నుంచి ఒక నది వచ్చింది. సరస్సులోంచి వచ్చింది గనుక ఆ నదిని సరయూ నది అన్నారు. ఈ నది అయోధ్య చుట్టూ ప్రవహిస్తోంది. అని రామాయణంలో సరయూ నది సందర్భంగా మానస సరోవర ప్రసక్తి వచ్చింది.

హిమాలయంలో అనేకచోట్ల వాగులు జనిస్తాయి. ఆ వాగులనేకం కలిసి ఒక సరస్సుగా తేలుతూ వుంటాయి. ఆ సరస్సుల అడుగున గల రాళ్ళ సందులోంచి సరికొత్త వాగులు తలెత్తుతుంటాయి. ఈ ప్రక్రియలు జరిగేటప్పుడు ఆయా ప్రాంతాలలోని అమూల్య ఔషదీ మొక్కల మీదుగా ఆ నీరు పారడం వల్ల అక్కడి వాగులకు అద్భుతమైన ఔషదీ గుణాలు సంక్రమిస్తూ వుంటాయి.

అనేక వాగులు కలిసి మానస సరోవరం ఏర్పడుతోంది. లేకపోతే 150 మైళ్ళ వైశాల్యం, అగాధమైన లోతుగల సరస్సు ఏర్పడటమంటే సామాన్యమా! ఇన్ని వాగుల సంగమం కనుకనే మానస సరోవర జలం ఒక మహా ఔషదిగా భావింపబడుతోంది.

ఈ మానస సరోవరం కైలాస పర్వతంలో వుందని పై శ్లోకం చెపుతోంది. కైలాసం అంటే శివపార్వతుల స్థానం. కైలాసమనే పదానికి రెండు రకాల వ్యుత్పత్తులు వున్నాయి. కే=లసతి అంటే నీటిలో ప్రకాశిస్తోంది, కనుక కైలాసం వుంది కనుక దీనిలో ఆ పర్వతం ప్రతిబింబిస్తోంది అని అర్థం. కైల-ఆస-అని మరో వ్యుత్పత్తి వుంది. కైలం అంటే కేళీ సమూహం. శివపార్వతుల నృత్యకేశులన్నమాట. అవి ఇక్కడ వుంటాయి కనుక కైలాసమయింది.

ఈ వ్యుత్పత్తుల వల్ల శివపార్వతులకు, కైలాస పర్వతానికి, మానస సరోవరానికి గల అవినాభావ సంబంధం మనకు అవగతమవుతుంది. అందుకనే అనాది కాలంగా శివపార్వతుల అనుగ్రహం సంపాదించదలచిన మహాత్ములు మానస సరోవరం దగ్గర తపస్సు చేశారు. విష్ణువలా చేశాడు. కపిలాది మహర్షులలా చేశారు.

దీనికి విరుద్ధంగా రావణుడు మానస సరోవరాన్ని వదిలి దాని ప్రక్కనే దాదాపు అంత వైశాల్యమూ వున్న మరో సరోవరం దగ్గర తపస్సు చేశాడు. శివదర్శనం కాలేదు. ఆగ్రహించి కైలాస పర్వతం పెకలించబోయి గర్వభంగం పొందాడు. ఇప్పటికీ ఆ రెండో సరోవరం పేరు 'రాక్షస్థల్' అనే పిలుస్తుంటారు స్థానికులు. దానిలోని నీరుని స్థానికులెవరూ త్రాగరు. దాన్ని విషమయ జలంగా భావిస్తారు.

తతో గచ్ఛేత రాజేంద్ర మానస తీర్థ ముత్తమం!

తత్రస్నా త్యానరోజన్ రుద్రలోకే మహీ యతే...!!

మానస సరోవర స్నానం వల్ల రుద్రలోక ప్రాప్తి కలుగుతుందని మహాభారతం చెపుతోంది.

సర్వధాతు మయస్తత్ర సుమహాన్ వైద్యుతో గిరిః

తస్యపాదసరః పుణ్యం మానసం సిద్ధిసేవితమ్....

కైలాస శిఖరం క్రిందగల మానస సరోవరాన్ని సిద్ధులంతా ఆశ్రయించారు అని వాయుపురుణాం చెబుతోంది.

ఉత్తరే మానసే స్నానం కుర్యాదాత్మ విశుద్ధయే

సూర్యలోకాది సంసిద్ధిః సిద్ధయే పితృముక్తయే...

అన్ని ధర్మశాస్త్ర గంథాలు చెబుతున్నాయి. మానస స్నానం వల్ల ఆత్మశుద్ధి, సూర్యలోక ప్రాప్తి కలుగుతుంది. (సూర్యలోకమంటే ముక్తి మార్గం) అంతేకాదు మంత్రసిద్ధి కలుగుతుంది. పితృదేవతలు తరిస్తారు అని అర్థం.

× × ×

హిమాలయాలు....

ఎక్కడ చూసినా మంచు... తెల్లటి కుప్పలు పోగుచేసుంచినట్టు.... ఉదయపు నీరెండపడి కళ్ళు చెదిరేలా మెరుస్తోంది. వాతావరణం విపతంమైన చలిగా వుంది. కళ్ళకు ఆచ్ఛాదనగా పచ్చటి పెద్ద ఆకులు కట్టి, ఒంటరిగా ఒక తెల్లటి యువకుడు ముందుకు పోతున్నాడు. ఏదో అన్వేషిస్తున్న వాడిలా పోతున్నాడతను.

ఎండకు మంచు మెల్లగా కరుగుతూ వుంది.

యువకుడి కళ్ళకు ఆకుల ఆచ్ఛాదన లేకపోతే ఆ మంచు వెలుగు చూసి అతని కళ్ళు పోయేవే...

పారుతున్న నీళ్ళ ప్రవాహం ఒకటి అడ్డొచ్చింది అతనికి... సవ్వడి చేయకుండా ప్రవహిస్తున్నాయి నీళ్ళు.

అక్కడ నీళ్ళు గడ్డకట్టకుండా పారడం విశేషమే... ఉండుండి చలిగాలులు జివ్వుమని వీస్తున్నాయి.... ఆ యువకుని ఒళ్ళు జలధరిస్తోంది చలిగాలికి.... అలాంటి వాతావరణంలో నీళ్ళలో దిగడం అంటే ఆత్మహత్య సదృశ్యమే...

బాగా ఎండెక్కితే గాని చలి కాస్త ఉపశమించదు.

నిజానికి ఎండ మామూలుగా వుండదా ప్రదేశంలో.... ఆరోజు ఎందుకో వుంది. ఆ యువకుడి అదృష్టం ఏమో బహుశా....!

× × ×

ఆ యువకుడు ఉత్తమ్....

ఒంగి ప్రవాహపు నీటికి తాకి చూశాడు. ఒళ్ళు జల్లుమంది. నరనరాన జివ్వున జలధరించింది. మంచుకంటే చల్లగా వున్నాయా నీళ్ళు. వున్నట్టుండి ఉత్తమ్ కనుకొసల నుంచి దూరంగా ప్రవాహపు ఒడ్డున నగ్నంగా, నల్లగా జడలు కట్టిన జుట్టుతో ఒక వ్యక్తి కన్పించాడు. శుష్కించిన శరీరంతో చర్మం కప్పుకున్న అస్తిపంజరంలా వున్నాడతను...

"హేయ్" అంటూ ఉత్తమ్ అటు దూకాడు.

అంతకు ముందే ఆ వ్యక్తి ప్రవాహంలోకి మునిగాడు. మళ్ళీ ఉత్తమ్‌కి కన్పించలేదా వ్యక్తి.

ఉత్తమ్ దిగ్భ్రాంతికి లోనయ్యాడు.

ఆ వ్యక్తి తేలనేలేదు. ఏమైనట్టు....?!

అంతా తెల్లటి మంచు. అనంతంగా నలువైపులా.... మధ్యలో నీళ్ళు....

ఉత్తమ్ ఉద్విగ్నంగా అంతా చూశాడు. ఆ వ్యక్తి కన్పించలేదు.

ఆ వ్యక్తి మళ్ళీ కన్పించడన్పించింది ఉత్తమ్‌కి...

ఉత్తమ్ గుండెల్లో అంతులేని నిరాశ..... మళ్ళీ ఈ అవకాశం వస్తుందా.... రాదా! తను ఎందుకోసం వచ్చాడో, ఆ పని నెరవేరుతుందా... లేదా...?

అయితే ఉత్తమ్‌కి ఆ వ్యక్తి ఏమయ్యాడో అర్థం కావడం లేదు.... ఊహాతీతంగా వుంది.

× × ×

అది హిమాలయం. భారతదేశపు ఆధ్యాత్మిక భూమి, యోగులకు, మహర్షులకు పుణ్యభూమి. అంతుచిక్కని అద్భుతాలకు, అపురూపాలకు నిలయం అది.

అక్కడ ఊహకు అందని విషయాలు ఎన్నో.... ఎన్నెన్నో... శాస్త్ర పరిజ్ఞానానికి ఎప్పటికీ అంతుచిక్కని మహత్తులెన్నో అక్కడ నిక్షిప్తమై వున్నాయి.

× × ×

ఉత్తమ్ సుకుమారంగా వున్నాడు. తెల్లటి చందమామలా వుందతని ముఖం. మంచుకంటే స్వచ్ఛంగా వున్నాయి అతని కళ్ళు. ఆ కళ్ళలో పట్టుదల క్రమంగా చోటు చేసుకోసాగింది.

ఉత్తమ్ దృఢ నిశ్చయంతో వున్నాడు. మతిచలించి ఏకదీక్ష పట్టిన వాడిలా వున్నాడు.

మంచుకొండల్లో పుట్టి పెరిగినవారే భయపడే ఆ ప్రదేశంలో, ఎక్కడో అమెరికాలో పుట్టి తొలిసారి ఇండియా వచ్చిన ఉత్తమ్ ఒంటరిగా, నిర్భీతిగా నడిచిపోతున్నాడు. ఒకటే నిశ్చయంతో పోతున్నాడు.

టక్కున ఆగాడు ఉత్తమ్! ఒక మంచు ప్రవాహాన్ని చూశాడు. వెడల్పు కొంచెం తక్కువగా వుందక్కడ. గడ్డలుకట్టిన మంచు నీటిమీద తేలియాడుతూ వుంది. క్షణక్షణానికి ప్రవాహపు ఒరవడి పెరుగుతోంది.

"ఎలాగైనా దాటాలి" అనుకున్నాడు ఉత్తమ్ మనసులో.

వణుకుతున్న శరీరాన్ని అదుపులో పెట్టుకుంఊట ప్రవాహంలోకి దూకాడు. క్షణకాలం వుక్కిరిబిక్కిరి అయ్యాడు. అదే మరొకరైతే అక్కడికక్కడే గడ్డకట్టుకుపోయేవాళ్ళు.... కాని మంచు గురించి బాగా తెల్సిన ఉత్తమ్ అవయవాలను స్వాధీనంలోకి తెచ్చుకుని అతి ప్రయత్నం మీద మంచు ప్రవాహాన్ని దాటాడు. ఒడ్డుకి చేరాడు.

తనకి తాను వేడి పుట్టించుకొంటూ, వెనక్కి తిరిగి ప్రవాహాన్ని చూశాడు. "ఆ ప్రవాహంలో మునిగిన వ్యక్తి ఏమైనట్టు" మళ్ళీ అనుకున్నాడు ఉత్తమ్.

అయితే ఉత్తమ్‌కి తెలీని విషయం ఒకటుంది. అది మామూలు ప్రవాహం కాదు. గోముఖ్ వద్ద పుట్టి సాగిపోతున్న పవిత్ర గంగానది.

ఆ విషయం తెల్సి వుంటే ఉత్తమ్‌కి అర్థమయ్యేది... ఆ వ్యక్తి ఎందుకు మునిగాడో.... ఆ వ్యక్తి ఎవరో...

× × ×

అన్వేషిలా సాగిపోతున్న ఉతమ్‌కి ఒక మంచుగుహ కన్పడింది. 'ఎస్.... ఇలాంటి గుహల్లోనే ఆ వ్యక్తులు వుంటారట... తను ఎలాగైనా కలవాలి' అనుకున్నాడు ఉత్తమ్.

మంచు గుహలోకి అడుగుపెట్టాడు. నిర్వికారంగా ముందుకు సాగిపోయాడు. అదో అద్భుత ప్రపంచంలా అన్పించిందతనికి.... ఎలా పోతున్నాడో అతనికే తెలియడం లేదు... ఏదో సుషుప్తావస్థలో వున్నవాడిలా వెళుతున్నాడు...

ఆ మంచు గుహ పొడవుగా వుంది. వున్నట్టుండి ఒక మలుపు వచ్చింది. మలుపు తిరిగాడు... ఎదురుగా మంచు ఎలుగుబంట్లు... వాటిని చూసి షాక్‌తో అచేతనంగా నిలబడిపోయాడు.

మంచు ఎలుగుబంట్లు గుర్రుమంటూ లేచాయి... వాటి గురకలు వికృతంగా వినడానికే భయం పుట్టిస్తున్నాయి.

మరుక్షణంలో ఉత్తమ్ మీద పడేవే...

ఇంతలో వాతావరణంలో ఏదో మార్పు వచ్చింది. మంచు ఎలుగుబంట్లు కళ్ళు మూతలు పడ్తుంటే మత్తుగా కిందికి వాలిపోయాయి.

ఉత్తమ్ భుజాన్ని నల్లటి అస్తిపంజరంలాంటి ఒక చేయి తట్టింది. వులిక్కిపడి వెనుతిరిగాడు...

ఇందాక ప్రవాహం దగ్గర కన్పించిన నగ్న వ్యక్తి.... ఆ వ్యక్తి శరీరం శుష్కించిపోయి వుంది. ఎముకలు బయటికి కన్పిస్తున్నాయి... జుట్టు జడలకట్టి కిందికి వేలాడుతోంది. ముఖం మాత్రం వింతకాంతితో వెలిగిపోతోంది. మౌనంగా ఉత్తమ్‌ని రమ్మని సైగ చేసి గుహ బైటికి కదిలాడు. ఉత్తమ్ అతన్ని ఫాలో అయ్యాడు.

× × ×

ఆ వ్యక్తి మెల్లగానే నడుస్తున్నాడు. అయినా ఉత్తమ్ అతన్ని అందుకోలేకపోతున్నాడు. ఉత్తమ్ ఆ వ్యక్తికి ఏదో చెప్పాలనుకున్నాడు. ఎన్నో అడగాలనుకున్నాడు. కాని అతని నోరు అతని స్వాధీనంలోకి రావడం లేదు. ఉత్తమ్‌కి ఏదో అంతు తెలియని శక్తుల మధ్య చిక్కుకుపోయినట్టుంది. మస్తిష్కం అంతా ఏదో సంచలనం...

ముందు నడుస్తూ ఆ నగ్న వ్యక్తి.... వెనుక ఉత్తమ్ పరిగెడుతూ....

అలా ఎంతదూరం నడిచాడో... తెలీదు ఉత్తమ్‌కి.... వున్నట్టుండి ఆగాడా వ్యక్తి.... అక్కడ మంచులో ఒక పొదలాంటిది వుంది. దాన్ని పెకలించాడా వ్యక్తి.... పుల్లల్లాగా వున్న ఆ చేతివేళ్ళు పట్టుకుంటూనే గడ్డి పోచలాగా వచ్చేసింది అంత బలమైన పొద. రక్కసి మట్టలాగ దాన్ని చీల్చాడు. అందులో ఒక దుంపలాంటిది వుంది. దాన్ని తీసి ఉత్తమ్‌కి ఇచ్చాడా వ్యక్తి... తినమని సైగ చేశాడు.

తన ప్రమేయం లేకుండానే దాన్ని నోటి దగ్గర పెట్టుకున్నాడు ఉత్తమ్. తలెత్తి ఆ వ్యక్తి వైపు చూశాడు. పరమ ప్రశాంతంగా చూస్తున్నాడా వ్యక్తి ఉత్తమ్‌ని. చిన్న చిరునవ్వు నవ్వి కుడిచేయి పైకెత్తి ఉత్తమ్‌ని ఆశీర్వదించాడా వ్యక్తి.

ఆ మరుక్షణమే ఉత్తమ్ కళ్ళు మూతలు పడిపోయాయి. మగతలోకి జారిపోయాడు. తిరిగి కళ్ళు తెరిచే సరికి ఆ వ్యక్తి లేడు. ఒక స్థానికుడు అటువస్తూ కన్పించాడు. ఆ స్థానికుడు ఉత్తమ్‌ని అక్కడ చూసి షాక్ తిన్నాడు.

× × ×

ఆ స్థానికుడు ఒక చమరీ మృగాల వేటగాడు. చమరీ మృగాల జాడల్ని తెలుసుకోవడం కోసం అటు వచ్చాడతను.

మామాలుగా ఆ ప్రదేశానికి స్థానికులు ఎవరూ రారు. భయంకరమైన మంచు తుఫాన్లు వస్తుంటాయి. ఆ ప్రదేశంలో మంచు జంతువుల ద్వారా లెక్కలేనన్ని ప్రమాదాలు ఎదురౌతుంటాయి. అంతుచిక్కని ఎన్నో ఆపదలు పొంచి వుంటాయి.

ఇప్పటికీ అక్కడ మంచు గుహల్లో భారతీయ యోగులు కొందరు సజీవంగా తపస్సు చేసుకుంటుంటారని ప్రతీతి.

అందుకే ఆ ప్రదేశంలో ఎన్నో అద్భుతాలు, వింతలూ ఎదురౌతాయని అంటారు.

స్థానికులు సామాన్యంగా ఆ ప్రదేశానికి రారు.

ఆ ప్రాంతంలో చమరీ మృగాలు ఎక్కువ. వాటి కోసం చమరీ మృగాల వేటగాళ్ళు ధైర్యం చేసి ఆ ప్రాంతానికి వస్తూ వుంటారు.

వాళ్ళు కూడా పైపైనే సంచరిస్తారు కాని మంచు లోయల్లోకి వెళ్ళరు.

× × ×

న్యూయార్క్ మహానగర... అర్ధరాత్రి....

నిద్రపోతున్న ఉత్తమ్ దిగ్గున లేచి కూచున్నాడు. తనకు ప్రతి రాత్రి క్రమం తప్పకుండా వస్తున్న కలని గుర్తుకు తెచ్చుకునే ప్రయ్నతం చేశాడు.

కలలో ఎవరో ఒక స్వామిజీ తరుచు కన్పిస్తున్నారు. ఆ స్వామిజీని తను ఇంతవరకూ ఎప్పుడూ, ఎక్కడా ప్రత్యక్షంగా చూడలేదు. మెలకువ రాగానే, హిందూమత స్వామిజీల గురించి చాలా పుస్తకాలు చదివాడు. ఆ తర్వాత చాలా రోజులకి ఆ స్వామిజీ దత్తపీఠాధిపతి, జగద్గురు, పరమపూజ్య శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీవారు అని అర్థమైంది. స్వామిజీ 1995లో తనకు అత్యంత ఇష్టమైన పదిమంది భక్తులతో కైలాస పర్వత యాత్ర చేసి, ఆధ్యాత్మికతకు ఆయువుపట్టయిన మానస సరోవరాన్ని దర్శించడం జరిగింది. ఇది అన్యులకు సాధ్యమయ్యే విషయం కాదు. చాలామంది మానస సరోవరాన్ని దర్శించుకోవడానికి వెళ్ళి, అది నెరవేరకుండా మధ్యలోనే తిరిగి వస్తారు. మరికొంతమంది ఎప్పటికి తిరిగిరారు.... స్వామిజీని ఒకసారి తలుచుకొని, ఆలోచనలలోంచి బయటపడ్డాడు.

ఒంటరిగా వెళుతున్నాడు ఉత్తమ్. అటూ ఇటూ తెల్లటి మంచు కొండలు. చిన్న కొండమలుపు తిరిగాడు ఉత్తమ్.

ఎదురుగా సముద్రం అంత సరోవరం... ఆ సముద్రానికి ఉత్తరభాగాన అస్తమించే సూర్యకిరణాలలో మిలమిలా మెరుస్తున్న మంచు శిఖరం. ఎటుచూసినా మంచు కొండలు.

ఆ పర్వతాలు.... ఆ సరస్సు.... సూర్యుడు అస్తమించేవేళ అద్భుతంగా వున్నాయి.

ఉన్నట్టుండి ఆ దృశ్యం మాయమైంది.

మరొక దృశ్యం ప్రత్యక్షమైంది.

ఎటు చూసినా తెల్లటి మంచు.... మధ్యలో ఒక మంచు నీటి ప్రవాహం పోతూ వుంది. ఒడ్డున వున్నాడు ఉత్తమ్. వున్నట్టుండి ఉత్తమ్‌కి దూరంగా.... నగ్నంగా జడల కట్టిన జుత్తుతో, తెల్లటి చర్మం కప్పుకున్న అస్తిపంజరంలా వున్న ఒక వ్యక్తి కనిపించాడు.

అరూస్తూ ఉత్తమ్ అటు దూకాడు.

కానీ ఆ వ్యక్తి నీటి ప్రవాహంలో మునిగి మళ్ళీ తేలలేదు.

× × ×

చాలాకాలం క్రితం దత్తపీఠాధిపతి జగద్గురు పరమ పూజ్య శ్రీ గణపతి సచ్చిదానంత స్వామీజీ వారి–

'మానస సరోవర యాత్ర' బుక్ చదవడం జరిగింది. దానిలోనే స్వామీజీ మానస సరోవరం యాత్ర గురించి అద్భుతంగా వర్ణింపబడింది.

ఆ మానస సరోవరం ఉత్తమ్ మనసులో నిలిచిపోయింది.

కలలా కన్పించిన సరోవరం అచ్చం అలాగే వున్నట్టనిపించింది ఉత్తమ్‌కి.

అదే.... హిమాలయ పర్వతాలలో వున్న మానస సరోవరం.

× × ×

నగ్నంగా జడలు కట్టిన జుత్తుతో తెల్లటి ఆస్తిపంజరంలా వున్న ఆ వ్యక్తి ఎవరు?

తనకు కలలో ఆ వ్యక్తి ఎందుకు కన్పించాడు?

ఉత్తమ్ మదిలో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి. నుదురు చెమటతో తడిచిపోయింది.

× × ×

నేపాల్ రాజధాని నగరం.... ఖాట్మండు.

ఆర్నికో ట్రావెల్స్... ఆఫీస్...

రిసెప్షన్‌లో వున్న నేపాలీ యువతి తన వద్దకు వచ్చిన తెల్లటి యువకుడ్ని తదేకంగా చూసింది. ఆ యువకుడు అమెరికన్‌లా వున్నాడు. తెల్లటి చందమామలా వుంది ఆ యువకుడి ముఖం. మంచుకంటే స్వచ్ఛంగా వున్నాయి అతని కళ్ళు. చేతిలో టూరిస్ట్ బ్యాగ్ వుంది.

"నా పేరు ఉత్తమ్. అమెరికా నుండి వస్తున్నాను. మానస సరోవరం చూడటం కోసం. అందుకు ఏర్పాట్లు చెయ్యగలరా..." అడిగాడు ఆ యువకుడు.

"మానస సరోవరం" గొణక్కుంటున్నట్లుగా తనలో తను అనుకుంది రిసెప్షనిస్ట్. "ఇట్ ఈజ్ టూ డేంజరస్" అంది పైకి.

మానస సరోవర యాత్ర ఎంత ప్రమాదకరమో ఆమెకు తెలుసు– అందుకే అలా అంది.

× × ×

తాతోపానీ–చైనా సరిహద్దు కేంద్రం....

ఆర్నికో ట్రావెల్స్‌వారి కారు తాతోపానీ చేరుకుంది. ఆ కారులో ఉత్తమ్ వున్నాడు. అతనితో పాటు అరుగురు జర్మనీ టూరిస్టులు కూడా వున్నారు. ముగ్గురు పురుషులు, ముగ్గురు స్త్రీలు. ఆ జర్మన్స్ కూడా మానస సరోవరం దర్శించటానికి వచ్చినవారే.

అక్కడ మొదటసారిగా ఉత్తమ్‌కి హిమశిఖరాలు కన్పించాయి. అది సరిగ్గా సూర్యాస్తమయ సమయం. ఆ హిమశిఖరాల అందాన్ని తదేకంగా చూస్తున్నాడు ఉత్తమ్.

ఇంతలో చీకటి పడింది. కారుని ఆపుచేశాడు డ్రైవర్... టెంట్ వేశారు. కొండ మార్గంలో అదే మొదటి రాత్రి బస. అక్కడ కరెంట్ లేదు. చిమ్మ చీకటి.

కుండపోతగా వాన పడుతుంది. టెంట్ పక్కన లోయలో ప్రవహిస్తున్న కొండవాగు గుండెలు జలధరించేట్లు ధనిచేస్తోంది. భయంకరమైన ఆ వాతావరణంలో జర్మన్ టూరిస్ట్‌లు బిక్కు బిక్కుమంటున్నారు. ఉత్తమ్ మాత్రం టెంట్ చివరకొచ్చి మిణుకు మిణుకు మంటున్న మిణుగురు పురుగుల గుంపుల్ని చూస్తూ నిలుచున్నాడు. ఆ నిశిరాత్రి భీతిగొలిపే వాతావరణంలో ఒక వింతైన అనుభూతి వుంది. అలా చూస్తూ వుండిపోయాడు ఉత్తమ్.

జర్మన్స్ స్లీపింగ్ బ్యాగ్స్‌లో దూరారు. ఒక జర్మన్ లేడీ చూపులు మాత్రం అపుడపుడూ ఉత్తమ్ మీద పడుతున్నాయి.

× × ×

మర్నాడు ఫ్రెండ్‌షిప్ బ్రిడ్జ్– అనే సరిహద్దు వంతెనను దాటి చైనా భూభాగంలోకి ప్రవేశించారు. కస్టమ్స్ చెకింగ్ జరిగింది.

అఘోరమైన కొండ దారులలో ప్రయాణించడానికి ‘టయోటా ల్యాండ్ క్రూసర్’ జీప్ ఒకటి, ఇంధనాన్ని, టెంట్లను, సామాన్లను, ఆహార పదార్థాలను, అత్యావశక్యమైన మందులను చేరవేసే ట్రక్కు అక్కడ రెడీగా వున్నాయి. వాటిని ట్రావెల్ ఏజెన్సీ వారు ఏర్పాటు చేశారు. వాటితో పాటు డ్రయివర్లు, ఒక గైడ్, ఒక చైనీస్, ఇంగ్లీషు దుబాసీ కూడా వున్నారు. వారు జర్మన్ బృందానికి, ఉత్తమ్‌కి స్వాగతం చెప్పారు.

దుబాసీకి తప్ప వేరెవరికీ పొడి ఇంగ్లీషు ముక్కలు కూడా రావు. అంతా సంజ్ఞల భాషే.

యాత్ర ప్రారంభమయింది. లోయల్లో ప్రయాణం... ఒక్కోసారి ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది.... అక్కడ రోడ్డు కాదు కదా కనీసం డొంకదార్లు కూడా లేవు. కొన్ని చోట్ల ఎడారి, కొన్ని చోట్ల గతుకు నేల, కొన్ని చోట్ల లోయలు, కొన్ని చోట్ల నదులు... ఇలా సాగుతోంది ప్రయాణం. అన్నిటినీ దాటుకొని ముందుకు సాగుతున్నాయి జీపులు.

కొన్ని చోట్ల ఎండకు చర్మం కందిపోతోంది. కానీ ఎండలో వేడి మాత్రం లేదు. సూర్యునిలోని సూక్ష్మ కిరణాలవల్ల కలుగుతుందా ప్రభావం.

‘జాంగ్మూ’ అనే చైనా సరిహద్దు కేంద్రం వచ్చింది. జాంగ్మూ సముద్ర మట్టానికి 11వేల అడుగుల ఎత్తులో వుంది.

రాత్రికి అక్కడే బస. ఆ మర్నాడు ప్రయాణం మళ్ళీ ప్రారంభమయింది. అనేక చోట్ల సుందరమైన జలపాతాలు దర్శనమిచ్చాయి. బాలటిబెటియన్ మాంక్స్ కనిపించారు ఒకచోట. గుర్రాలతో పోతున్న ఒక దేశదిమ్మరి గుంపు కన్పించింది. కనీ వినీ ఎరుగని ప్రకృతి దృశ్యాలు కన్పిస్తున్నాయి. అంతా అద్భుతంగా వుంది. ఆ అనుభవం గమ్మత్తుగా వుంది ఉతమ్‌కి.

తర్వాత ‘పైకాత్సో’ అనే సర్సు వచ్చింది. ఆ సరస్సు తీరాన టెంట్ వేశారు.

× × ×

ఈ సరస్సునే చిన్న మానస సరోవరం అంటారు. దీని పక్కనే చిన్న కైలాస శిఖరం వుంది.

× × ×

సముద్ర మట్టం నుంచి భూభాగ మట్టం పెరుగుతున్న కొద్దీ వాతావరణంలో కొన్ని మార్పులు వస్తాయి. హిమాలయాల వంటి వున్నత పర్వతాలు ఎక్కుతున్నప్పుడు ఈ మార్పులు తీవ్రంగా వుంటాయి. అందువల్ల దారిలో ఆగి ఆగి ఒకటి రెండు రోజులు విశ్రాంతి తీసుకొంటూ ప్రయాణం చేస్తే శరీరం ఆ మార్పులకు అలవాటుపడి సర్దుకుపోతుంది. లేకపోతే తీవ్రమైన బాధల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది.

ప్రతి 3వేల అడుగుల మాట్టానికి కనీసం 2 రోజులు విశ్రాంతి అవసరం.

'పైకాత్సో' సరస్సు 13 వేల అడుగుల ఎత్తులో వుంది.

× × ×

ఆ రాత్రి జర్మన్ టూరిస్ట్‌లకు తలనెప్పి, ఆకలిలేదు. కడుపులో వికారం–ఊపిరి అందక, ఆయాసం వంటి బాధలు కలిగాయి. వారు తెల్లవారుజామున ముఖం కడుగుతుంటే నోటిలోంచి ముక్కుల్లోంచి నెత్తురు కండలు పడసాగాయి. తేమ ఏమాత్రంలేని పొడిగాలి వలన ఇది సంభవిస్తుంది అని చైనీస్ దుబాసీ చెప్పాడు. విచిత్రంగా ఉత్తమ్‌కి ఏ సమస్యా రాలేదు.

అది చూసి జర్మన్ టూరిస్ట్‌లే కాదు, డ్రైవర్లు, గైడ్ దుబాసీ కూడా ఆశ్చర్యపోయారు.

నీరు గడ్డగట్టుకుని పోతోంది. చలి నరాలను వణికిస్తోంది. ఎందుకో తెల్లవారుజామున లేచిన జర్మన్ లేడీకి ఉత్తమ టెంట్ బయట కన్పించాడు అంత చలిలోను... ఆమె ఉత్తమ్ దగ్గరికి వెళ్ళింది. అక్కడ కన్పించిన దృశ్యం చూసి ఒళ్ళు పులకరించింది.

నిండు చంద్రుడు, పండు వెన్నెల, పిండి ఆరబోసినట్లు మంచు, హిమోన్నత శిఖరాల పైన ప్రతిఫలిస్తున్న చంద్రకిరణాలు.... ఆ అందం అద్భుతం... కాని ఆ అందాన్ని అనుభవించేందుకు లేకుండా నరనరాన్ని గజగజా వణికిస్తున్న చలి....

గడగడ వణుకుతూ టెంట్ లోపలికి వెళ్ళిపోయింది జర్మన్ లేడీ.

కానీ ఉత్తమ్ తదేకంగా ఆ దృశ్యాన్ని చూస్తూ నిలబడి వున్నాడు.

× × ×

మర్నాడు ఉదయం తిరిగి ప్రయాణం మొదలైంది.

ఆ రోజంతా ప్రయాణం సాగింది.

సూర్యాస్తమయం కావస్తోంది. అయినా ఏవో కొండలు అడ్డువస్తున్నాయి కానీ మానస సరోవర కైలాస శిఖరాల జాడలు ఎక్కడా కనిపించడం లేదు.

ఇంతలో చిన్న కొండ మలుపు – ఎదురుగా కన్పిస్తున్న దృశ్యానికి అందరూ స్థంభించిపోయారు.

ఎదుదుగా సముద్రం అంత మానస సరోవరం. ఆ సరోవరానికి ఉత్తరభాగాన అస్తమించే సూర్యకిరణాలలో మిలమిలా మెరిసే కైలాస శిఖరం...! మరోపక్క గుర్లా మంధాత పర్వతశ్రేణి.

ఆ పర్వతాలు, ఆ సరస్సు, ఎర్రని సూర్యుడు... వర్ణనకందని ఆ అందం చూసి అందరూ పులకించి పోయారు.

అక్కడికక్కడే నిలబడిపోయారు.

సూర్యాస్తమయ దృశ్యం కరిగిపోతున్న కొద్దీ కైలాస శిఖరం మీద మానస సరోవరం మీద బంగారు పూతలు క్రమంగా తగ్గిపోసాగాయి.

అందరూ ముందుకు ప్రయాణం సాగించారు.

ఆ సరస్సు ప్రాంతాల్లో యాత్రికుల సౌకర్యం కోసం కొన్ని ఇళ్ళు వున్నాయి. ఒక ఇంటిలో రాత్రికి బస చేశారు. ఆ రాత్రి ఎవరికీ శ్రమ కలగలేదు.

చాలా విచిత్రంగా కైలాస మానస దర్శనం అయేసరికి అందరికీ అన్ని బాధలు మరుపుకు వచ్చాయి. ప్రతివారు ఏదో తెలియని ఆనందంలో తేలియాడుతున్నారు.

× × ×

సరిగ్గా సాయంత్రం ఆరు గంటలు అవుతుండగా ఉత్తమ్‌తో పాటు జర్మనీ యాత్రికులు బసలోంచి బయటికి వచ్చి ఆధ్యాత్మిక ప్రపంచానికి ఆయువుపట్టు అయిన మానస సరోవరం వైపు చూస్తూ భక్తి పారవశ్యంతో తేలియాడుతుండగా ఓ వింతయిన సంఘటన జరిగింది.

అనన్యం, అద్వితీయం.... అయిన ఆ సంఘటన అక్కడున్న అందర్నీ తీవ్రమైన ఆనందోద్వేగానికి లోను చేసింది.

ఎటువైపు నుంచి వచ్చిందో తెలీదు గాని విష్ణుమూర్తి హంసతూలికా తల్పమైన ఆదిశేషువు పడగల్ని పోలిన పెద్ద నీడ సరోవరం మీదికొచ్చింది నెమ్మదిగా... నెమ్మదిగా....

సూర్యకాంతికి అడ్డుపడే కొండలుగాని, మరే అడ్డుగాని లేవు. మరి ఆ నీడ ఎలా వచ్చిందో ఎవరికీ అర్థం కాలేదు.

ఆ అరుదయిన వింతను అచ్చెరువొందు తుండగానే సుదూర తీరాల నుంచి ఏదో శబ్దం విన్పించడం ప్రారంభమైంది.

అందరూ చెవులు రిక్కించి శబ్దాన్ని శ్రద్ధగా వింటుండగానే ఆ శబ్దంలోంచి ఓంకారనాదం స్పష్టంగా విన్పించడం ప్రారంభమైంది.

భాష వేరయినా, భావం మాత్రం అటు జర్మన్స్‌లో, ఇటు ఉత్తమ్‌లో ఒకటే చోటుచేసుకుంది.

భాషకి, చేష్టకి అందక–కేవలం అనుభూతికి మాత్రమే అందే ఆ భావం పేరే ఆదిశంకరుడు.

(ఇప్పటికీ పై రెండు సంఘటనలు ప్రతిరోజూ సాయంత్రానికి మానస సరోవర ప్రాంతంలో చోటు చేసుకోవడం ఎవరికి అంతుపట్టని అత్యంత రహస్యంగానే మిగిలి వుంది) మొత్తానికి తను కన్న కలల్ని ఉత్తమ్ నిజం చేసుకున్నాడు.

× × ×

మహానగరం.....

ఆకాశాన్నంటే మహాభవనాలు.... ఒకదాని వెనుక ఒకటి....

మరోపక్క ఇంకొకటి...

దాన్ని తలదన్నేట్టు మరోటి....

ఆ మహా భవనాల్లో–

నాగరికత మేసిన జనాలు.... మమతలు మరచిన మనుషులు....

అందాల బొమ్మలు.... అపురూప లావణ్యాలు....

ఆ భవన సముదాయానికటు ప్రక్క బిక్కుబిక్కుమంటూ మురికివాడలూ, పాకలూ, రేకుల షెడ్‌లూ... వంకర టింకరగా.... గజిబిజిగా..... అందమైన శరీరంమీద అమ్మవారి కుండల్లాగ!

ఆ పాకల్లో.....

సగం చచ్చిన జనాలు.... ఈసిరోమంటున్న పిల్లలు–

కొందరు నగ్నంగా, మరికొందరు అర్ధనగ్నంగా– జారిపోతున్న లాగులూ.... కారుతున్న ముక్కులు... కళ్ళలోనే ప్రాణాలు–

అది చెన్నై మహానగరం.... మానవ మహారణ్యం...

శరీరంలోని నరాల అల్లికలాగ నగరం నిండా అడ్డదిడ్డంగా వ్యాపించిన మురికి కాలువలు... వాటినిండా చెత్తా చెదారం....

భరించరాని దుర్గంధం....

అయితే అదంతా ప్రజలకి అలవాటే, నిత్యజీవితంలో అనుభవమే. నిజానికి ఈ దోమలు, ఈగలూ, దుర్గంధం లేకపోతే వారికి నిద్రపట్టదేమో అన్న దుస్థితికి చేరుకున్నారు ఆ నగర ప్రజలు–రాజకీయ నాయకుల పుణ్యమా..... అని–

ఒక దిసమొల కుర్రాడు మురుగు కాలువలో మూత్రవిసర్జన చేస్తూ వుండగా....

ఆహారం కోసం బయలుదేరిన ఐరావతం లాంటి సూకరం ఒకటి–ఆ కుర్రాడు చేస్తున్న పని చూసి మురిసిపోయి మహోత్సాహంగా గుర్రుగుర్రుమంటూ పరుగు పరుగున అక్కడికి వచ్చేసింది.

దాన్ని చూసి హడలిపోయిన కుర్రాడు చటుక్కున లేచి పరుగు అందుకుని ఎదురుగా వస్తున్న అమ్మాయిని ఢీ కొట్టాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Amrutha**

* * *